"మాటల కేమిలేగాని రాఘవయ్యగారి అబ్బాయిని చేసుకో చక్కగా."

"ఛ...ఛ...బి. యస్. సి. యేగా చదివింది"

"అయితే ఏం! పిల్లాడు ఎలా వుంటాడను కున్నావ్! దబ్బపండులాగ వుంటాడు. చాలా అందగాడు. చదువుకున్న పిల్లనిగాని చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాడు"

"ఆ అబ్బాయి సంగతి నాకు చెప్పక్కర్లేదు. నల్లగా పదడుగుల ఎత్తున రాత్రి కలలో కొచ్చేట్టు వుంటాడటగా?" మూతి తిప్పుకుంది.

"ఛ. ఎవరు చెప్పారు. చూద్దావుగాని పద."

"అక్కర్లేదు పిన్నీ... మొగుణ్ణి వెతుక్కోవ డానికి రాలేదు నేనీవూరు నీ కూతురు పెళ్ళి కొచ్చాగాని"

"నీ పొగరు బాగా అణచే మొగుడొస్తాడులే"

"చూద్దాం."

"చూద్దాం. ఇహ ఆరు నెలలేగా. పై చదువు ఎలాగా చదివించడులే మీ నాన్న."

* * *

ఇందిర ఇంటర్ ప్యాసైంది. తండ్రి ఇహఏమైనా సరే చదివించనని పట్టుపట్టాడు. పెళ్ళి చేసుకోకపోతే నూతిలో పడతానని ఇందిర తల్లిరాగాలెట్టింది. సంబధాలు వెతికారు. నాలుగు నెలలలోనే సంబంధం కుదిరింది. కుర్రాడు గుంటూరులో కాలేజీలో ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు.

"సాయంత్రం చూడటానికి వస్తారు. చక్కగా డ్రస్ చేసుకో" అని మందలించాడు ఇందిర తండ్రి. ఇందిర కిష్టం లేకపోయినా తప్పలేదు.

వరుడు అతని, తల్లిదండ్రులు, మరోపెద్దమనిషీ వచ్చారు.

ఇందిర తలపైకెత్తి చూసింది. తనకళ్ళని ,తనే నమ్మలేకపోయింది! ఆ ఆరడుగులవ్యక్తి !అభూతం! ఆనాడు గుడ్డివెన్నెల్లో కన్పించిన భూతం! గేదెను మీదికి తేలిన బ్లైండ్ ఫెలో, బ్రూట్...వగైరా... వగైరా...కాని వరుడు సుధాకర్ ఏమాత్రం ఆశ్చర్యపడలేదు. అంతా ఇదివరకే తెలిసినట్లుగా నటించాడు.

"బ్లైండ్ ఫెలోని, పైగావట్టిబ్రూటేని, చేసుకున్నావేం?" రహస్యంగా కాగితంమీద వ్రాసి పంపించాడు. పెళ్ళి జరుగుతుండగా ఒక కుర్రాడి ద్వారా కాగితం తిరిగొచ్చింది. "అంతేకాదు... పచ్చి దొంగకూడాను... ఇంకా చెప్పాలంటే వొట్టి మోసగాడుకూడాను" అని మరోపంక్తులు వ్రాసివున్నాయి.

---

స్కెచ్

# స్వాములవారి చేతిచలువ

"పారిజాత"

అసలా వూళ్లో వెంకట్రామయ్య నెరుగని వారు లేనేలేరు. అతనంటే అందరికీ అదోవిధమైన "భావం" కలుగుతూండేది. వెంకట్రామయ్య ఒక స్వాముల వారిని చేరదీసేడంటే, మొదట్లో ఎవ్వరూ నమ్మలేక పోయేరు. కొంతకాలం వరకూ అది గోప్యంగానే గడిచిపోయింది. తరువాత పట్టణాలలో ఊరేగింపులూ ఉపన్యాసాలూ, సభలూ, సన్మానాలూ జరిగేప్పటికి—"వెంకట్రామయ్యని మనం సరిగా అర్థంచేసుకోలేదురా"—అని అనుకొన్న వారి సంఖ్య వందలుదాటి వేలు చేరుకొంది. స్వాములవారు మాత్రం అలుకూ, కులుకూ, లేకండా వెంకట్రామయ్యనే అంటిపెట్టుకొని వుంటున్నారు.

స్వామివారి మహాత్తుగురించి ఆయన చేసిన ఘనమైన పనులుగూర్చి పలువురు పలువిధములుగా ప్రచారం చేయడం జరిగింది. ఒక పెద్ద బహిరంగ సభలో వెంకట్రామయ్యతోసహా పలువురు ఘరానా పెద్దమనుషులు ఎవరికి తోచిన విధంగా వారు

వారివారి స్వీయానుభవాలు ఉగ్గడించడం మొదలెట్టారు.

స్వామివారి విభూతివల్ల గత అయిదారేండ్లనుంచీ భూతపిశాచాల బాధపడే మా ఇంట్లో యిప్పుడు కులాసాగా వుంటున్నామని ఒకాయన ఉదాహరణగా చెప్పాడు. స్వామివారి చేతిచలువవల్ల సంతానం లేక పరితపించే నాకు కవలపిల్లలు కలిగారని మరొకాయన చెప్పాడు. స్వామివారి దర్శనభాగ్యంవల్ల చిరకాలం శనిగ్రహపీడితుడనై, నిరుద్యోగినై, దరిద్రం అనుభవించే, నాకు యిప్పుడవేమీ లేక సుఖంగా రెవెన్యూబోర్డులో క్యాంపుక్లార్కుగా వుంటున్నానని, ఓ పెద్దమనిషి చెప్పాడు. స్వామివారి తీర్థప్రసాదాలు సేవించిన నాకు చిరకాలం నావంట్లో వుండే చెప్పరాని, తెలియరాని బాధలుపోయి ఆరోగ్యంగా వుంటున్నానని మరో పెద్దమనిషి శెలవిచ్చాడు.

అటుపిమ్మట వెంకట్రామయ్య దీర్ఘోపన్యాసమిస్తూ స్వాములవారి కీర్తిని కొనియాడాడు. "అటువంటి మహాభక్తి సంపన్నుడు—త్యాగశీలుడైన స్వాములవార్ని వెంకట్రామయ్య నమ్మడంలో ఆశ్చర్యంలేదు. ఆయన చేసినపనులు ఎవ్వరూ చేయలేరు. వెంకట్రామయ్య సామాన్యుడా—పట్టి దగాకోరు దేశద్రిమ్మర్లను నమ్మేందుకు?"—అను అనుకొన్నారు. ప్రజలందరికీ దీనితో వెంకట్రామయ్య అంటే ఒక విధమైన నమ్మకం కల్గింది ప్రజల్లో. ఇదివరలో వెంకట్రామయ్యకి ఎంత చెడ్డపేరుందో దానికి మూడురెట్లు మందాన్ని పరువూ ప్రతిష్ఠ పెరిగిపోయాయ్. ఎక్కడికెళ్ళినా వెంకట్రామయ్యకి సుస్వాగత ప్రియవచనాలే—

ప్రజల్లో నానాటికీ స్వాములవారిమీద భక్తివిశ్వాశాలు ఎక్కువవుతున్నై. ఈ సమయంలోనే స్వామివారి మకాంమార్చాల్సిన రోజులొచ్చినై. వారికి ఉదారంగా విరాళాలియ్యాల్సిందని ఒక పెద్దసభలో వెంకట్రామయ్య నొక్కిచెప్పాడు. చెప్పడమేతడవుగా హేండ్‌బాగ్‌లోంచి పది చిన్నకట్టలు —కొత్తకరెన్సీ— స్వాములవారికి జమకట్టేడు. విరాళమంటే ఎరుగని వెంకట్రామయ్య దశమానంకాదు సరికదా—శతమానం కాక — సహస్రనామం జపించేసరికి సభలో గల్లంతు జరిగినట్లనిపించింది. అప్పటికప్పుడు వెయ్యి రూపాయిలదాకా వాగ్దానాలూ, అయిదొందల దాకా వసూళ్ళూ జరిగినై. స్వామివారికళ్ళు పచ్చబడినై—

ఆనాడు స్వామివార్కి వీడ్కోలు సభజరిగింది. మర్నాడుదయం ఎనిమిదింటికి స్వామివారి ప్రయాణం ఖాయం చేయబడింది. వాగ్దానాలు చేసినవారూ యింకా యివ్వదల్చినవారూ అంతా తమతమ కోరికలు నెరవేర్చుకొన్నారు. వెంకట్రామయ్య "ఉదారత"ను కొనియాడారు. స్వామివార్ని కీర్తించేరు. ఆనాటిసభ జయజయహర్షధ్వానాలమధ్య జయప్రదంగా ముగిసింది.

మర్నాడు ఏడుగంటలకల్లా స్వామివారి మఠం ముందు జనం లెక్కకట్టడానికి అతీతంగావున్నారు. తీరాచూస్తే ఏముంది—స్వామివారు పరారీ— అంతా స్వాముల్ని దూషించారు. పాపం వెంకట్రామయ్య మాత్రం ఏచేయగలడు. ప్రజలంతా నమ్మినట్లే వెంకట్రామయ్యకూడా నమ్మేడు. వారికంటే వెంకట్రామయ్య ఎక్కువ తిన్నదేముంది?— స్వామివారి మహిమలు పొగడిన ఘరానాపెద్దమనుషులంతాకూడా పరారీ అయినట్లు తెలిశాక— వారు స్వామివారి ఏజంట్లుఅని తెలుసుకొన్నారు. విరాళాలిచ్చిన దాతలు. వెంకట్రామయ్యని సరిగా అర్థంచేసుకోలేని ప్రజలు అతనంటే అదోరకమైన జాలిగావుంటారు.

స్వాములవారు—వారి ఏజంట్లు వెంకట్రామయ్యకి ఆత్మీయులేననిమాత్రం ప్రజలకు తెలియదు. దాతలకి అంతకంటే తెలియదు.

